# పసి మనసులు

ప్రజలమీద అలిగినట్టు సూర్యుడు మొహం ఎర్రగా చేసుకుని పడమటి కొండల చాటుకు పారిపోతున్నాడు. అందమైన అమ్మాయి నుదుటి మీద ఎర్రటి తిలకంలా పశ్చిమదిశ అరుణ రాగంతో మెరుస్తున్నది ఆకాశం. వర్షం కురిసి వెలిసిన తర్వాత ప్రశాంతంగా ఉన్నది ప్రకృతి. గేటుమీద అల్లుకున్న తీగ గులాబీ ఆకులు చిరు గాలికి కదిలి నీటి బిందువులు రాలుస్తున్నాయి. బయటి నుంచి చిన్న మేకపిల్ల ఆ ఆకులను అందుకోడానికి ప్రయత్నిస్తున్నది. పార్కులో రేడియో నుంచి ఏవో అరవ పాటలు వినబడుతున్నాయి. ఎదురుగా లాడ్జిలో ఉంటున్న కాలేజి విద్యార్థులు మేకప్పులు పూర్తయి షికారుకు బయలుదేరారు.

పుస్తకంలో వ్రాయడానికి ప్రయత్నిస్తున్న ఆశ కళ్ళు ఎంత తుడిచినా మళ్ళీ నిండిపోతున్నాయి. వ్రాయ బుద్ధికాక పుస్తకం, పెన్సిలు కింద పెట్టి లంగాతోటి కళ్ళు గట్టిగా తుడుచుకున్నది. ఏడవడంచేత కళ్ళు ఎర్రబడ్డాయి. కిందపెట్టిన పెన్సిలుకేసి మరోసారి చూసింది. 'స్క్రూ'తో తిప్పడం వలన మొదట అందంగా వంకులు వచ్చాయి. ఆ సాయంత్రపు నీరెండలో మెరిసిపోతున్నది. 'ఛీ! వెధవ పెన్సిలు! దీని మూలాన్నుంచే అంతా...' అనుకొంది దానికేసి కోపంగా చూస్తూ.

అసలు జరిగినదేవిటంటే... ఆశకు వాళ్ళ నాన్నగారు రెండు రోజుల క్రితం తనే పిల్చి కొత్త పెన్సిలు ఇచ్చారు దాని రంగులుచూసి మురిసిపోయి గంతులువేసింది ఆశ. జాగ్రత్తగా సంచీలో దాచుకున్నది. ఆరోజు స్కూలుకు వెళ్లేటప్పుడు, సంబరంగా క్రిష్ణకు చూపింది. క్రిష్ణ దాన్ని చేతిలోకి తీసుకుని పట్టి పట్టిచూశాడు. ఆశ తనమాట కాదనదనే ధైర్యంతో "నాకియ్యవూ?" అని అడిగేశాడు. 'కొత్తది, పసుపు రంగుమీద రంగు రంగుల వంకుల గీతలతో మెరిసిపోతున్నది.

మోజుగా ఒక్క సారన్నా వ్రాయనిదే.. తన కిమ్మంటే ఎలాగ? ఎంత స్నేహితుడైనా? ఇవ్వనని తల అడ్డంగా తిప్పి అతని చేతినించి లాక్కున్నది. అంతే! నీళ్ళు తిరుగుతున్న కళ్ళతో ఆమె వైపొకసారి చూసి, విసురుగా వెళ్ళిపోయాడు. మళ్ళీ పలకరించలేదు. మొదటిరోజు పెన్సిలు ముచ్చటలో పడి కిష్టుడితో మాట్లాడక పోవడం బాధగా అనిపించలేదు. కాని ఇంకో రోజు గడిచేసరికి అలవాటుగా స్నేహితుడితో ఆటలు, మాటలు లేకపోవడంతో ప్రాణం కొట్టుకుపోతున్నది. తనను అరుగుమీద చూసినా చూడనట్టు వెళ్ళి పోతున్నాడు కిష్టుడు మాట్లాడకుండా. మళ్ళీ ఆశ కళ్ళు నీళ్ళతో నిండాయి. గేటు తీసుకుని ఏడేళ్ళ కిష్టుడు లోపలకు వచ్చాడు. సాయంత్రమయ్యేసరికి ఆశతోటి పార్కుకు వెళ్ళి ఆడుకునే వాడు ఇంచక్కా! ఆ పిల్ల తనతోకూడా లేకపోతే వెధవపార్కు ఏమీబావులేదని విసుక్కుని, ఆరు కాకముందే, ఇంటికి వచ్చేశాడు. కళ్ళనీళ్ళతో కూర్చున్న ఆశను చూసి చూడనట్టు లోపలకు పోయాడు.

'ఛీ! తప్పుపని చేశాను!' అనుకున్నది ఆశ. కోపం అంతా పెన్సిలుమీదికి తిరిగింది. 'దీని మూలాన్నుంచే ఈ గొడవ అంతా!... దీన్నించే కిష్టుడు మాట్లాడ్డం మానేశాడు.' మళ్ళీ ఓసారి "వెధవ పెన్సిలు" అని కసిగా తిట్టుకుంది. తిరిగి కిష్టుడితో జట్టుకట్టడమెలాగో తెలియలేదు ఆ పిల్లకు. 'పోనీ, ఆ పెన్సిలు యిచ్చేస్తేనో?' మంచి ఆలోచనే. కాని చచ్చినా పుచ్చుకోడు! అసలే చాల కోపం వాడికి. ఏం పాలుపోవడంలేదు. కిష్టుడు జట్టులేకపోతే రోజులు గడవడమెలాగన్న బెంగ పట్టుకుంది ఆశకు.

'తనంటే ఎంతో ఇష్టం వాడికి. మరి వాడంటే మాత్రం తనకు ఇష్టం లేదా? అమ్మ ఎప్పుడు తాయిలాలు పెట్టినా వాడికి సగం యిస్తుంది తను. కొనుక్కోటానికి డబ్బు ఇస్తే వాడేం కొనమంటే అదే కొంటుంది. క్లాసులో తనను ఎవరైనా ఏమైనాఅంటే వాళ్లను కిష్టుడు చితక కొడతాడు. మొన్నటికి మొన్న నాలుగు రోజుల క్రితం తన క్లాసులోనే చదువుతున్న శేషగిరి తన జడలు రెండూ వెనకాతల్నించి విప్పేశాడు. పిల్లలందరూ నవ్వడంచూసి ఏంచేయాలో తెలీక తను ఏడుపు మొదలు పెట్టింది. కిష్టుడు వాణ్ణి నాలుగు తన్ని టీచరమ్మతో చెప్పి కొట్టించాడు. అంతకుముందోసారి పలకపుల్ల మరిచి పోతే వాడి పలక పుల్ల తనకిచ్చి టీచరమ్మ దగ్గర దెబ్బలు తిన్నాడు. పాపం! అలాటి కిష్టుడితో మాట్లాడకుండా ఉండడమెలాగ? ఎలాగయినా, రేపు వాడితో మాట్లాడేయాలి!' నిశ్చయించుకుంది ఆశ. మళ్ళీ ఆ పిల్లదృష్టి పెన్సిలుమీద పడింది. 'మొదట ఈ వెధవ పెన్సిలు అమ్మకిచ్చేయాలి నా కొద్దని.' తనలో తనే అనుకొంటూ అది చేతితో తీసుకుని లేచింది.

టపటప అడుగులువేస్తూ వస్తున్న ఆశను చూసి వాళ్ళమ్మ నవ్వుతూ అడిగింది "ఎవరిమీద, పాపా కోపం?" అని, అంతే, "ఈ పెన్సిలు నాకొద్దు!" అంటూ కిందకు విసిరేసింది. మెరుస్తున్న రంగులు ఇప్పుడు పాప కళ్ళకు ఆకర్షణీయంగా లేవు.

"ఏమిటే? మరీ మితిమీరుతున్నావ్! ఏమయింది దానికి?" గట్టిగా తల్లి కేకలు వేయడంతో రెండు చేతులతో కళ్ళు నులుముకుంటూ ఏడవడం సాగించింది.

"ఏమయిందమ్మా? చెప్పు, తల్లీ!" బుజ్జగించగా వెక్కుతూ ఆ 'కథంతా' చెప్పింది తల్లితో! వాళ్ళమ్మ గట్టిగా నవ్వేయడంతో ఉడుకుమోత్తనంతో మేడమీదికి పారిపోయింది.

కిష్టుడు కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా కలయ తిరుగుతున్నాడు. ఆశ ఏడవడం చూసినప్పటి నుంచి వాడి మనసు పీకుతున్నది, తన మూలాన ఆపిల్ల ఏడుస్తున్నదని! 'అయినా తనదే తప్పు! కొత్తది. ఇంకా వ్రాయక మునుపే అడిగేశాడు తాను! ఇవ్వనంటే అంత కోపం దేనికి తనకు? అప్పటికలా అన్నా తర్వాత తప్పక ఇచ్చేది. అయినా వెధవ పెన్సిలు వలన ఆశతో మాటలు మానేసాడు. రోజులా ప్రక్క ప్రక్కన కాకుండా చెరోమూలా కూర్చున్నారు నిన్నా మొన్నా క్లాసులో! అంచేతే తనసలు పాఠాలు విననేలేదు. ఇలా సాగిపోతున్నాయి కిష్టుడి ఆలోచనలు.

"ఇంకా తెల్లారక ముందే పూచిన రెండు పువ్వులూ కోసేయడం! బుద్ధిలేక అద్దెకిచ్చాము" సొంతవాళ్ళకన్నా ఎక్కువలా.." ఎవరినో గట్టిగా అరుస్తున్న తల్లి కేకలతో మేలుకున్నది ఆశ. 'ఇవాళ ఏడుగంటల కల్లా బడికి వెళ్ళాలి కదా?' అనుకుంటూ అలమార దగ్గరకు వెళ్ళి పళ్ళపొడి తీసుకుని మెట్లు దిగింది. అప్పుడే స్నానంచేసి తల దువ్వుకుని ఉతికిన బట్టలు వేసుకుని వీధి అరుగుమీద నిలబడిన కిష్టుడిని చూసి తొందరగా మొహం కడుక్కుని తల్లి ఇచ్చిన 'కోకో' ఒక్క గుక్కలో తాగి "మరేం, అమ్మా! ఇవాళ ఎలాగైనా కిష్టుడితో..." ఆశ మాట పూర్తిచేయకముందే "వాడి పేరెత్తావంటే దెబ్బలు తింటావు. వెధవ సావాసాలూ, నువ్వూనూ... వేరే బళ్ళో చేర్పిస్తానుండు ఈసారి" అంది తల్లి కిష్టుడి తల్లి మీద కోపం కిష్టుడిమీద కక్కింది ఆశా వాళ్ల తల్లి. కిక్కురుమనకండా లేచివచ్చి తొందరగా స్నానంచేసి రెడీ అయింది స్కూలుకు! సంచీ భుజం మీద తగిలించుకుని బయటకు వచ్చింది ఆశ. అంతవరకూ నిలబడిన కిష్టుడు లోపలకు వెళ్ళి తన సంచీ తెచ్చుకున్నాడు. ఇద్దరూ గేటు వరకు మాట్లాడకుండా వచ్చారు. మెల్లిగా గేటుపైకి ఎక్కి తీశాడు కిష్టుడు. బయటకు వచ్చాక సంచీ క్రిందపెట్టి గేటు వేసేసింది ఆశ రోజు చేసేలాగే!

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు వీధిలో. ఇవాళ ఎలాగైనా వాడితో మాట్లాడేయాలని ఉంది ఆశకు. ఆపిల్ల మొదట మాట్లాడిస్తే మాట్లాడుదామని చూస్తున్నాడు కిష్టుడు. జంక్షను దగ్గర బస్సు వస్తుండటం చూసి ఆగారు ఇద్దరూ. సంచీ లోపలి నుంచి పెన్సిలు తీసి మెల్లిగా వాడిచేతిలో పెట్టింది. మళ్ళా ఎక్కడ కింద పారేస్తాడో ననే శంకతో "పెన్సిలు అచ్చంగా నువ్వే తీసేసుకోరా! నా జట్టు ఉంటావు కదూ! ఏరా! మాట్లాడుతావా?' అంది.

తొందరగా అడుగుతున్న ఆశను చూసి నవ్వుతూ తిరిగి పెన్సిలు ఆ పిల్ల చేతిలో పెట్టాడు కిష్టుడు.

దానితో ఆపిల్ల కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. "ఇక ఎప్పుడూ మాట్లాడవురా నాతో? అంతేనా?" సగం ఏడుపు గొంతుతో అడిగింది.

అప్పటికి గొంతు పెకల్చుకుని "నీజట్టు ఉంటాగా? నీజత పండేలే! మాట్లాడతాను గానీ ఏడవకు" అన్నాడు నిదానంగా.

"అయితే తీసుకో పెన్సిలు నాకొద్దు. వేరే నాన్న నడుగుతాలే!" సంతోషంగా అన్నది.

"ఉహూ! వద్దు! పాపం నువ్వే ఉంచుకోవే! నిజంగా చెబుతున్నా - చాలా నాకొద్దు. "ముద్దుగా అన్నాడు.

"పోనీ... ఎప్పుడయినా రాసుకుంటావా?" సంశయిస్తూ అడిగింది.

"సరేలే!" సంతృప్తిగా ఒప్పుకున్నాడు. వాడితో కులాసాగా కబుర్లు చెబుతూ నడిచింది. సాయంత్రం బడినుంచి వస్తూ అడిగింది ఆశ. "ఏరా కిష్టుడూ! అమ్మ పొద్దున్న ఎవర్ని తిట్టింది? నేను నీగురించి చెబుతుంటే నీతో చేరవద్దని తిట్టింది..."

నవ్వుతున్న కిష్టుడి మొహం ముడుచుకుపోయింది. "మా అమ్మ పొద్దున్నే మీ పువ్వులు కోసి దేవుడికి పెట్టింది... అందుకనీ..." అన్నాడు ఆగిపోతూ.

"పోనీలేరా! మనం ఇంకెప్పుడూ దెబ్బలాడుకోవద్దు. ఏం?" మొహం మీద పడుతున్న జుట్టును వెనక్కు త్రోసుకుని వాడిచేయి పట్టుకుంది.

జంటగా వచ్చి గేటు తీస్తున్న వాళ్ళిద్దర్నీ చూసి వీధి అరుగుమీద నిలబడ్డ కిష్టుడూ వాళ్ళమ్మా, ఆశా వాళ్ళమ్మా ఒకర్నొకరు చూసుకుని పక్కున నవ్వారు. వాళ్ళిద్దరినీ చూసి కిష్టుడూ, ఆశా ఇంకా గట్టిగా నవ్వి, లోపలకు పరుగెట్టారు!

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

తేది : 15-3-1963